"అమితాబచ్చన్ వయస్సూ నలభయ్యే" తనని అమితాబ్‌తో పోల్చేసరికి చాలా సంతృప్తి ఫీలయ్యాడు టి.టి.యి "కాని అతని హైటు ఆరు నాలుగు మీ హైటు నాలుగు ఆరు!"

"అయితే?"

"మీరా హైటు లేరు కాబట్టి మీ వయస్సు నలభై కాకుండా పోదు అలాగే మా చిన్నికొండ పొడవెక్కువున్నాడు కాబట్టి వాడి వయసు మూడేళ్ళు కాకుండా పోదు."

"ఇలాంటి కంపేరిజన్లతో మీరు రైల్వేని మోసం చేయలేరు" ఇక 'మామూలు' కోసం గాక మామూలు డ్యూటీ నిర్వహిద్దామని రిసీట్ బుక్ తీశాడు.

"ఏంటదీ" గభాలున లాక్కుంది రిసీట్ పుస్తకాన్ని.

అక్కడ టి.టి.యి. చేసిన పొరపాటు ఆమె చూసి వెనక్కి యిచ్చేదాకా ఆగకుండా ఉక్రోషంగా ఆమె చేతిలోని పుస్తకాన్ని లాగేసుకుంటూ తన చేతిని ఆమె చేతికి ఆనుకోకుండా అయినా తాకించటం.

"యూ" అంటూ ఆవేశంగా పైకిలేచి కంపార్టుమెంటు చైన్ లాగేయాలని ఓ క్షణం ఆవేశపడి ఆనక "ఇక్కడ కాదు.... నెక్స్ట్ స్టేషనులో నీ సంగతి చూస్తాను" అంటూ ఉద్రేకాన్ని అభినయించేస్తోంది.

ఏమైందో అర్థంకాని టి.టి.యి. హరిత పూనకమొచ్చినట్లు ఎందుకు వూగిపోతుందో తెలీక "అసలేమైంది?" అన్నాడు కంగారుపడుతూ.

"నా చెయ్యి పట్టుకుంటావా?"

అదిరిపడ్డాడు టి.టి.యి.

"ఇట్స్ ఏనెస్సాల్ట్! హోల్డింగ్ ది హేండాఫ్ ఎ లేడీ డెలిబరేట్‌లీ టు ఇన్సల్ట్ హెర్ ఈజ్ నథింగ్ బట్ ఎనెస్సాల్ట్ పజ్ ఫర్ ఐ.పి.సి. సెక్షన్ నెంబర 353 అండ్...." ఆగింది. ఒకవేళ ఇంగ్లీష్ క్షుణ్ణంగా అర్థం కాకపోతే తన ఊపుకో అర్థం లేకుండా పోతుందని "అసలు కనీసం నీకు రెండేళ్ళు శిక్షపడుతుందని తెలిస్తే ఇలా ఆడవాళ్ళ కూపేలో వయసులో వున్న యంగ్ లేడీ చేయి పట్టుకునేవాడివి కాదని కోర్టుద్వారా....".

"అమ్మా.... అమ్మా.... నేను కావాలని తాకలేదు తల్లీ.... పొరపాటున చేయి తగిలింది" అక్కడ మరెవరూ లేకపోతే కాళ్ళమీద పడదామన్నంత కంగారు పడిపోయాడు....

"వద్దమ్మా! పిల్లలు గలోడ్ని"

"నే నూరుకోను."

"ఊరుకోండి లాయర్‌గారు" ఆశ హరితని అదుపు చేయబోతున్నట్లుగా మరో అస్త్రం సంధించింది "ఏదో అందరి ఆడవాళ్ల మాదిరిగా వయస్సులో వున్నారు కాబట్టి తాకాడే అనుకోండి."

"మీ పేరేంటోగాని తల్లీ మీరూ అలా అనడం బాగోలేదు" లాయర్ అని తెలీడంతో మరింత గగ్గోలు పెట్టేస్తున్నాడు "పొరపాటై పోయింది లెంపలేసుకుంటాను"

"లేదు! ఇలాంటి అత్యాచారాన్ని మొగ్గలోనే తుంచేయకపోతే ఇది తరతరాల స్త్రీ జాతికి తీరని కళంకం. ఒక ప్రముఖ క్రిమినల్ లాయర్‌గా నా వృత్తికే తీరని ద్రోహం... ఆశా... ఎప్పుడు నెక్స్ట్ స్టేషన్...."

"మీ కాళ్ళు పట్టుకుంటాను మేడమ్! నన్ను క్షమించేయండి" చేతులు జోడించటంతో కొంచెం శాంతపడింది.

"క్షమించేస్తాను గాని మరి మా అబ్బాయి ఈ సంఘటన్ని వాళ్ళ నాన్నకి చెబితే... అదే నువ్వు చేయి తాకడం."

"చెప్పడండి.... చిన్న వయస్సుకదా!"

"ఎంత చిన్న వయస్సు?"

"ఎక్కడండీ! మూడేళ్ళ పిల్లాడు. మరేం కదా!"

"కాదు వాడి వయస్సు ఎనిమిది" స్థిరంగా అంది హరిత.

"కాదు, మేడమ్! స్పష్టంగా తెలిసిపోతుంటేనూ?" నానీని ఆప్యాయంగా తల నిమిరి "ఇంకా మూడు కూడా నిండి ఉండదన్నది నా నమ్మకం".

"సరే.... క్షమించేశాను."

బ్రతుకుజీవుడా అని బయటికి వెళ్ళాడు.

టి.టి.ఇ. వెళ్ళిపోగానే ఓ అయిదునిమిషాలపాటు నవ్వాపుకోలేకపోయింది ఆశ "నీతో ప్రయాణమంటే మహా ప్రమాదకరమే" అంది చివరగా.

"ఎందుకు?"

"ఎప్పుడూ ఇలాంటి పేచీ ఏదో ఒకటి తీసుకొస్తుంటావుగా?"

"నీకు తెలీదు ఆశా.... ఈ దేశంలో తనను తాను రక్షించుకోవాలని అణుకువగా ఆరాటపడే ఆడదెప్పుడూ అణగదొక్కబడుతూనే వుంటుంది. అది చరిత్ర.... కాబట్టి నేను డిఫెన్స్ సైడ్ నిలబడి సరదాగా ఆట పట్టిస్తుంటాను."

"నిజానికి ఓ పసికందుకి టిక్కెట్‌కి డబ్బులు చెల్లించడమన్నది మనకి సమస్య కాదు ఆశా.... కాని వీళ్లు ముందు ప్లాన్ చేసేది మామూలుకోసం - అదీ సవ్యమైన అప్రోచ్‌లో అయితే పర్వాలేదు - ముందు దబాయించాలని చూస్తారు. అదే నేను యిష్టపడనిది" ఓ క్షణం జరిగింది గుర్తు చేసుకుంది "పాపం మహా హడావుడి పడిపో యాడు మానవుడు తరువాత స్టేషన్‌లో పిలిచి పెనాల్టీ చెల్లించేద్దాం" అంది హరిత మనస్ఫూర్తిగా.

రాజమండ్రిలో టి.టి.ఇ. కోసం చూసింది. కాని ఎడ్రస్ లేకపోవడంతో భోజనం తెప్పించుకున్నారు వేరే కండక్టర్‌కి చెప్పి.

నానీ మంకుపట్టు పట్టాడు తిననని-

కాని చివరికి హరితే గెలిచింది.

నాని కళ్లలో గిర్రున నీళ్ళు తిరిగాయి....

“అదిగో.... ఏంటా కన్నీళ్ళు....” ఆందోళనగా అడిగింది హరిత. “ఏదయినా మారాంచేసి సాధించుకోవాలిగాని ఏడ్చే పిల్లలంటే నాకు మహా కోపం.”

తలూపాడు కళ్ళు తుడుచుకుంటూ-

నిజానికి అమ్మపోయి ఎన్నో రోజులు కూడా కాలేదు....

కాని ఎన్నో సంవత్సరాలు గడిచినట్టుంది.

ఎవరున్నారని తనకి ఇంత ఆప్యాయంగా అన్నం తినిపించడానికి

భోజనం పూర్తయ్యాక హరిత నవ్వించాలని చాలా ప్రయత్నించింది. కాని నానీ ఇక మామూలు స్థితికి రాలేకపోయాడు....

అమ్మ ఎప్పుడూ కన్నీళ్లు పెట్టుకునే అర్ధరాత్రివేళ నిన్న ఎవరో తట్టినట్టు ఉలిక్కిపడి నిద్రలేచిన నానీకి బయట మాటలు వినిపించాయి గుస గుసల్లా....

“వాడు బ్రతికి ఎల్లుండి కోర్టుకి వస్తే మొత్తం కథ బయట పడ్తుంది. అందరి కథలూ ముగిసిపోతాయి. ఈ కాసుల పేరు తీసుకో... పది తులాలు రేపు సాయంకాలం నానీ స్కూల్ నుంచి వచ్చేక నువ్వు చేస్తావో లేక మరెవరికన్నా ఆ బాధ్యత అప్పచెబుతావో.... ఎలాగూ వాడికి ఏటి ఒడ్డుకు వెళ్ళడం యిష్టం. కాబట్టి యుక్తిగా తీసుకెళ్ళి నదిలోకి తోసెయ్.”

కిటికీ వారనుంచే చూశాడు.

సరళత్తయ్య రాజారావుకి చెబుతోంది-

రాత్రంతా భయంతో వెక్కిపడుతూనే వున్నాడు.....

సాయంకాలందాక స్కూల్లో ఉండలేక మధ్యాహ్నమే ఇంటికొచ్చేసి దిగులుగా అంతా చెప్పేశాడు తాతయ్యకి.

తాతయ్య వణికిపోయాడు ముందు..... ఆ తర్వాత ఆయాసంతో రొప్పుతూ “నాకు జబ్బెక్కువయిందిరా వెంటనే మందు తీసుకురాగలవా? అని అదెక్కడ దొరుకుతుంది అంటే అనకాపల్లిలో ఆగి వున్న ట్రైనెక్కి ఏడవస్టేషన్ దాకా ప్రయాణం చేసి అక్కడ దిగమన్నాడు..... అక్కడ నిలబడ్డ ఓ గెడ్డం డాక్టరు దగ్గరకెళ్ళి మందు అడిగితే ఇస్తాడన్నాడు.

ఆ మందు పేరు “బ్రతికించే మందు” అని కూడా స్పష్టంగా చెప్పాడు.

తాతయ్య ఏం ఆశించి ఇదంతా చేసిందీ ఆలోచించే జ్ఞానంలేని నానీ “రాజారావు కంటమాత్రం అస్సలు పడగూడదురోయ్” అంటూ తాతయ్య రహస్యంగా అన్న విషయాలన్నీ బాగానే గుర్తుంచుకున్నాడు.

అర్ధరాత్రి సమీపిస్తూంది.

మాగన్నుగా కూర్చునే నిద్రపోతూ ట్రైను కుదుపుతో కళ్ళు తెరిచిన ఆశ, హరిత పక్కకు చూస్తే నానీ లేడు.

కంగారుగా బయటకొచ్చి వెతికారు.

ట్రైను కదిలేదాకా ఆత్రంగా ఎదురు చూశారు. నానీ రాలేదు.

కాని హరిత పక్కనున్న వెడ్డింగ్ కార్డుపై ఏవో అక్షరాలు కనిపించాయి. సమీపంలో వాలెట్‌లోని పెన్నూ వుంది.

"త్వ మేవ మాతా చ పితాత్వ మేవ త్వమేవ బంధుశ్చ సఖాత్వమేవ- అమ్మలాంటి మంచి ఆంటీ నీకు నా దణ్ణం..... నాని."

అప్రతిభురాలయి చూస్తూ వుండిపోయింది ఆ వాక్యాలవేపు.

సరిగ్గా ఇదే సమయానికి....

ఏడో స్టేషన్‌లో లెక్క ప్రకారం దిగిన నానీ భయంతో ఓ స్థంభం చాటునే నిలబడి "బ్రతికించే మందు" ఇవ్వాల్సిన గెడ్డం డాక్టరు కోసం దిక్కులు చూస్తున్నాడు....

కనిపించలేదు....

నిర్మానుష్యంగా వున్న ప్లాట్‌ఫాం వెలుగులో దూరంగా చీకటిలో నిలబడ్డ ఓ ఆకారాన్ని చూసి అటు కదిలాడు.

చాల దగ్గరగా వచ్చాకగాని గుర్తుపట్టలేకపోయాడు.

అక్కడ నిలబడింది డాక్టరు కాదు-కర్కశంగా నవ్వుతున్న రాజారావు. అంతే-

గొంతు దాటని పెనుకేక గుండెల్లో అలజడి రేపగా ప్రాణభీతితో పరుగెత్తాడు....

కేవలం రెండు నిమిషాల వ్యవధిలో ప్లాట్‌ఫామ్ రెండో అంచును చేరడంతోపాటు ఆ చీకటిలో నిద్రపోతున్న ముష్టివాళ్ల మధ్య పడుకుండిపోయాడు.

ఒకవేళ రాజారావు సరాసరి నానీనే వెంటాడి వుంటే ఆ రాత్రి నానీకి చివరి రాత్రయ్యేది.

కాని ఏ శక్తో అడ్డం పడినట్లు చీకటిలో ప్లాట్‌ఫాంపై వున్న ఓ ట్రాలీని తన్నుకుని ముందుకు తూలిపడ్డాడు రాజారావు.

పెదవి చిట్లి మొహం నేలని తాకడంతో-

మరింత ఉక్రోషంగా పైకిలేచి కుంటుకుంటూ నడిచాడు.

అప్పటికే ఓ చిరిగిన దుప్పటిని లాక్కున్న నానీ తలనిండా కప్పుకున్నాడు.... కొద్దిగా కదిలాడు తనవైపున్న దుప్పటి నెవరో లాగేసినట్టనిపించిన భిక్షగాడు....

నానీ కంపించిపోతున్నాడు....

చలికి వణికిపోతున్న భిక్షగాడు ఏ మాత్రం నిలదీసి ప్రశ్నించినా అక్కడకి సమీపంలో నిలబడే వున్న రాజారావుకది వినిపిస్తుంది.

అది చాలు తనను రాజారావు గుర్తించడానికి.

పైకి లేచిన భిక్షగాడు క్షణంపాటు తనని తాకుతూ పడుకున్న పసికందునుచూసి దుప్పటి లాక్కోవడానికి బదులు నానీ కాళ్ళపై పడ్డాడు నిశ్శబ్దంగా.

మసక వెలుతురులో చూశాడు నానీ- కోపం తెచ్చుకోకుండా ఆ మాత్రం జాలి చూపించిన ఆ వ్యక్తి తాతయ్యలా వున్నాడు తల పండిపోయి.

నీరవ నిశీధిలో ఏదో గొణుక్కుంటూ మరలా నానీ పక్కనే పడుకుని ఆప్యాయంగా పైన

చేయికూడ వేశాడు.

నానీకి నిద్ర రావడంలేదు.

నెమ్మదిగా తలతిప్పి చూస్తే రాజారావు ఇప్పుడు సిమెంటు బెంచిమీద కూర్చునివున్నాడు ఓ నియాన్ లైటుక్రింద.

ఏడుపొచ్చేసింది.

ఇప్పుడేమౌతుందో తెలీదు- ఎంతకాలం వెంటాడబడతాడో తెలీదు.

సరిగ్గా అప్పుడు ఇలాంటివేళ కావలించి పడుకునే అమ్మ గుర్తు వచ్చింది.

తను  చెప్పిన నవ్వుపాట జ్ఞప్తికొచ్చింది.

"ఏడిస్తే నా కళ్లకారే నీలాలంటే నా కసహ్యం
కాని నాలా ముద్దుగా నవ్వే పువ్వులంటే ఎంతో ఇష్టం
ఆకాశం ఏడ్చినపుడు రాల్చే వర్షమంటే అయిష్టం
కానీ నీలాకాశంలో నవ్వే హరివిల్లంటే మరి ఇష్టం
టీచర్ కొడితే వచ్చే కన్నీళ్లంటే అసహ్యం
కాని అల్లరి చేయొచ్చా అని అమ్మ నవ్వుతూ పాడే లాలిపాటంటే మరి మరి ఇష్టం."

గొణుగుతున్నట్టుగా అనుకుంటుంటే "ఏమిటమ్మా పాడుతున్నావు" అన్నాడు కావలించి పడుకున్న వృద్ధుడు.

బెదురుగా పక్కకి చూశాడు రాజారావుకి వినిపించిందేమో అని.

రాజారావు లేడక్కడ.

కొద్దిపాటి ధైర్యాన్ని తెచ్చుకుని "మరేమో ఏడవొద్దని అమ్మ నేర్పిన నవ్వుపాట" అన్నాడు.

"పిచ్చినాన్న.... పెద్దింటి బిడ్డలా వున్నావు" వృద్ధుడు లేచి నానీ అందమైన మొహంలోకి చూశాడు.

"అమ్మ చెబితే మాత్రం వచ్చే ఏడుపు ఆగుతుందట్రా?"

"ఓ... ఇప్పుడాగిపోయిందిగా"

"బువ్వ తింటావా?" నెమ్మదిగా మూటలోంచి సత్తుగిన్నె తీశాడు తను తినగా మిగిలింది ఆ పసికందుకు తినిపించాలని.